విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 15, ఫిబ్రవరి 2023

వాలంటీర్‌ను పరామర్శించిన సర్పంచ్ దంపతులు

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోని బొల్లవరం-నందికొట్కూరు కేజీ రోడ్డు మార్గం మధ్యలో దామగట్ల గ్రామ వాలంటర్ బైక్‌పై వెళ్లుతుండగా తన వెనకాలే వస్తున్న మరో బుల్లెట్ బైక్ ఢీకొనదంతో వాలంటీర్ సంజీవ్‌కుమార్ తీవ్ర గాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుని విషయం తెలుసుకున్న బ్రాహ్మణ కొట్టుకూరు పోలీసులు చికిత్స నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడ డాక్టర్లు కర్నూలుకు రిఫర్ చేయడం జరిగింది. దీంతో సంజీవ్‌కుమార్‌ను 108వాహనంలో కర్నూల్ విజయ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ దంపతులు మాధవరం సుశీలమ్మ, రత్నం హుటాహుటిన కర్నూల్ హాస్పిటల్ కి చేరుకొని వాలంటీర్ను పరామర్శించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లను కోరారు.

మంచి నీటి ఎద్దడి రాకుండా చూడండి

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో ఎలాంటి మంచి నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి రామిశెట్టి వీరభద్రుడు అధికారులకు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వ సభ్య సాదారణ సమావేశాన్ని ఎంపిపి అధ్యక్షుతన నిర్వహించారు. ఈ సమావేశం లో ఎంపిపి మాట్లాడుతూ ఏ గ్రామంలో కూడా త్రాగు నీటి సమస్యతో ప్రజలు ఇక్కట్లు పడరాదన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు.శాసన మండలి ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో సమావేశంను నామమాత్రంగా నిర్వహించారు.వైస్ ఎంపిపిలు ముల్లా రఫి,ఆశీర్వాదమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి,మండల వైద్యాధికారి అంజలి,పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు సాయిబాబా,దీప,ఏఓ రంగనేతాజి, ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి,ఏఈలు కొండారెడ్డి,షాజహాన్, జగ్గయ్య, ఆర్ఐ విజయలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి,ఏపిఎంనాగమ్మ, ఎంపిటీసిలు నరసింహులు, వెంకట రాముడ,షంషాద్, శంకరి బాయి, షాహిదా,రాజేశ్వరి, బేబమ్మ,సర్పంచ్లు బాలీశ్వరరెడ్డి,గోవిందయ్య,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తిరుణాల మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోనీ కొత్త బిజినవేముల గ్రామంలో ఈ నెల 18 నుంచి 22 వరకు శ్రీ కాశి చంద్రమౌళీశ్వర స్వామి తిరుణాల మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి కార్తీక్ మంగళవారం తెలిపారు.ఆయన తెలియజేస్తూ 18న శనివారం రాత్రి 11గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. 19న ఆదివారం సాయంత్రం ఐదుగంటలకు ప్రభోత్సవము, రాత్రి 10గంటలకు గుండు, పందెములు కలవన్నారు. 20న సోమవారం సాయంత్రం ఐదున్నర గంటలకు రథోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు పారువేట, 22న బుధవారం ఉదయం 9గంటలకు తీర్థావళి నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ చంద్రమౌళీశ్వర తిరుణాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజవర్గ ఎమ్మెల్యే ఆర్థర్, ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరు కావడం జరుగుతుందన్నారు. ఈ తిరుణాల మహోత్సవ వేడుకలలో ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా గ్రామసర్పంచ్ రవియాదవ్ గ్రామంలో ప్రత్యేకమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మయూర వాహనంపై శివపార్వతులు

విశాలాంధ్ర -శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రంగా విరజులుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నాడు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు సాయంకాలం అక్కమహాదేవి అలంకరణ మండపంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేయించి మయూర వాహనంపై వేంచి అలంకరణ పూజలను అర్చక స్వాములు శాస్త్రవేత్తకంగా నిర్వహించారు. మేధావులు తాళాల నడుమ మంగళ వాయిద్యాలు నడుమ వేదమంత్రోచ్చా రణతో గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. ఈ గ్రామోత్సవంలో దేవస్థానం వారు ఏర్పాటుచేసిన కళాకారుల విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ

విశాలాంధ్ర -శ్రీశైలం: శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా మంగళ వారం ఉదయం కార్యనిర్వహణ అధికారి ఎస్. లవన్న అధికారులతో కలిసి డార్మెంటరీలను, కళ్యాణకట్టను తాత్కాలికంగా భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 30 పడకల ఆసుపత్రిని పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉప సర్పంచ్ గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచ్, వైసిపి నాయకులు కే. లక్ష్మీకాంతరెడ్డి(కె.పి.బాబు)(46) గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సమేతంగా దైవదర్శనానికి వెళ్లి సోమవారం రాత్రి వచ్చిన కేపీ బాబు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలారు. గుండెపోటుతో ఆకస్మికంగా కేపీ బాబు మృతి చెందడంతో వైసీపీ శ్రేణులు, గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. బనగానపల్లి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, ప్రచార కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, రాజారెడ్డి,టిడిపి బనగానపల్లె నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ మూలె రామేశ్వర్ రెడ్డి తదితర ప్రముఖులు కేపీ బాబు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేపీ బాబు అన్న కె.పి రామ్మోహన్ రెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : స్థానిక ఎంపీడీవో కార్యాలయ భవనంలో బుధవారం ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మంజులవాని తెలిపారు.మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని వారు సూచించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచులు,ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు జడ్పిటిసి హాజరుకావాలని వారు తెలిపారు.

ఉగాది నాటికి నిర్ధేశించిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

విశాలాంధ్ర - నంద్యాల : నిరుపేదలందరికీ ఇళ్ళు పథకం కింద జగనన్న లేఔట్లలో ఉగాది నాటికి కేటాయించిన 10,464 ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్ ఎంపీడీవోలు, మండల తాసిల్దారులు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటనరీ హాలులో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల తాసిల్దారులు, హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉగాది నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలన్న నేపథ్యంలో ప్రగతి తక్కువగా ఉన్న మండలాల్లో ప్రతిరోజు సమీక్షించాలని ఎంపీడీవో, తాసిల్దార్లు, హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో కేటాయించిన 10464 ఇళ్లలో ఇప్పటివరకు కేవలం 1907 గృహాల మాత్రమే పూర్తయ్యాయని మిగిలిన గృహాలను ఉగాది లోపు పూర్తి చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవోలను, తాసిల్దారులను, హౌసింగ్ అధికారులను ఆదేశించారు.హౌసింగ్ పిడి రామశేషు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ద్వామా పిడి రామచంద్రారెడ్డి, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, నంద్యాల, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, నియోజకవర్గ స్పెషల్ అధికారులు, ఎంపీడీవోలు తహసిల్దార్లు,ఎపిఓలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

లద్దగిరి శీను హత్య నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-డోన్ : గత వారంలో జరిగిన మైనింగ్ ఓనర్ లద్దగిరి శీను హత్య కేసు ముద్దాయిలను డోన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి అరెస్ట్ చూపించారు. ప్యాపిలి దగ్గరలో ఏ-1 కొచ్చేరువు గ్రామానికి చెందిన పిక్కిలి జనార్ధన్ నాయుడు, ఏ-3 సుగాలి రాము, ఏ-2 వల్లే లక్ష్మన్న (ఏ-4 , ఏ-7) నాగిరి శేఖర్, హరిజన లాలెప్ప, వడ్ల నెట్టికంటయ్య, తపేల నరసింహులులను పట్టణ పోలీసు స్టేషన్‌లో అరెస్ట్ చుపించారు.ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ హత్యకు ఉపయోగించిన మూడు మోటారు సైకిళ్ళు,ముద్దాయిల వద్ద నుండి 6సెల్ ఫోనులు,అందరి ముద్దాయి వద్ద నుండి 57,000/- నగదుతో పాటు నేరానికి ఉపయోగించిన పిడి బాకు,రెండు రోకలి బండలు స్వాధీనం చేసుకున్నామన్నారు.మేరకు జలదుర్గం పిఎస్ 10/2022 యు/సెక్ 302, 120(బి) ఆర్/ డబ్ల్యు 34ఐపిసి కేసులో ముద్దాయిలు అయిన ఏ-1 పిక్కిలి జనార్ధన్ నాయుడుకి కొచ్చేరువు గ్రామంలో సుద్దా గని కలదని, అయితే అదే వూరికి చెందిన లద్దగిరి శ్రీనివాసులు మైనింగ్ వ్యాపారం చేస్తూ జనార్ధన్ నాయుడుకి సుద్దగనికి రాయల్టీలు లేవని సంబంధిత అధికారులకు చెప్పి గనిని సీజ్ చేపించారన్నారు. సుద్దటి గని పేర్లకు రాయల్టీలు లేవని సీజ్ చేయించడం జనార్ధన్ నాయుడుకి ఆర్థికంగా నష్టం కలుగాజేసినాడని, దానికి జనార్ధన్ నాయుడుకి పెనాల్టీలు కట్టుకొని బాడుగకు వచ్చిన ట్రిప్పర్ లను విడిపించడం వల్ల ఆర్థికంగా తీవ్ర నష్టం పోయాడని,సదరు విషయం జనార్ధన్ నాయుడు మనసులో పెట్టుకొని సుమారు ఒక సంవత్సరం క్రిందట లద్దగిరి శ్రీనివాసులను చంపుతాను అని ఫోన్ చేసి బెదిరించినాడన్నారు. అప్పుడు లద్దగిరి శ్రీనివాసులు కర్నూల్ ఎస్పీని కలవగా ఎస్పీ ఫ్యాక్షన్ జోన్ వారికీ అప్పగించగా జనార్ధన్‌నాయుడు, అతని బంధువులను పిలిపించి మందలించి పంపడం జరిగింది. అప్పటి నుంచి కూడా లద్దగిరి శ్రీనివాసులు రాయల్టీ అధికారులకు, విజిలెన్సు అధికారులకు జనార్ధన్‌నాయుడు మైన్స్ పట్టించి జనార్ధన్‌నాయుడునీ ఆర్థికంగా తీవ్ర నష్టం కలుగజేస్తు నాడని, అతన్ను చంపేస్తే జనార్ధన్‌నాయుడు మైనింగ్ వ్యాపారానికి ఎలాంటి ఆటంకులు వుండవని భావించి 2023వ సం,, సంక్రాంతి పండుగ తర్వాత జనార్ధన్ నాయుడుకి తెలిసిన, అతని కులస్థుడు చంద్రపల్లికి చెందిన వల్లె లక్ష్మన్నతో లద్దగిరి శ్రీనును చంపడానికి 6లక్షలు రూపాయలు కాంట్రాక్టు ఒప్పుకొని అడ్వాన్సుగా 2లక్షల రూ.లు నగదుగా ఇచ్చి మిగిలిన డబ్బులు పని పూర్తయిన వారం రోజుల తర్వాత ఇస్తాను అని చెప్పాడన్నారు. లక్ష్మన్న తనకు పరిచయం ఉన్న కిరాయ హంతకులతో చర్చించి శ్రీనివాసులను చంపడానికి పథకం పన్నీ వారికీ ఒక్కొకరికీ 30,000/- రూపాయలు నగదు ఇచ్చినాడని విచారణలో తేలిందన్నారు. ఎలా చంపాలి ఎక్కడ చంపాలి అని జనార్ధన్ నాయుడుతో లక్ష్మన్న,వారి టీంతో నిర్ధారణ చేసుకున్నారని, పథకంలో బాగంగా ఈ నెల 8వతేదీన లద్దగిరి శ్రీనివాసులు కొచ్చేరువు నుండి హుస్సైనపురం గ్రామంకు అది లక్ష్మిని ఎక్కించుకొని తిరిగి మల్లెంపల్లి దేవరకు వెళ్ళాతాడని అల ఒంటరి గా వెళ్ళేటప్పుడు జనార్ధన్‌నాయుడు ఇచ్చిన సమాచారం మేరకు మార్గ మధ్యం లో బెస్త శివలింగం పొలం వద్ద లక్ష్మన్న లద్దగిరి శ్రీను బైక్ ఆపగా అక్కడే ప్రక్కన వున్నా శేఖర్, లాలప్ప, నరసింహులు, రాము, నేట్టికంటి అందరు రోకలిబండతో కొట్టి, పిడి బాకుతో పొడిచి అక్కడనుండి వారు తెచ్చుకొన్న బైక్ లలో పారిపోయారన్నారు. తప్పించుకొని తిరుగుతూ వుండగా 13వ తేది సోమవారం జనార్ధన్ నాయుడు, లక్ష్మన్న, రాములను అరెస్ట్ చేసి వారు ఇచ్చిన సమాచారం మేరకు మిగిలిన ముద్దాయిలు శేఖర్, లాలప్ప, నేట్టికంటి, నరసింహులును 14వ తేది మంగళవారం అరెస్ట్ చేసి వారి నుండి ఏపి 21 ఏడి1953, ఏపి02ఏ ఎల్ 2915, ఏపి39హెచ్‌డి 2621 నెంబర్లు గల మూడు మోటారు సైకిళ్ళును, ముద్దాయిల వద్ద నుండి 6సెల్ ఫోనులు, నగదు 57,000/స్వాధీనం చేసుకున్నామనీ తెలిపారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేసిన ప్యాపిలి సీఐ శ్రీరాములు, జలదుర్గం ఎస్సై ఎం.నరేష్ మరియు ప్యాపిలి ఎస్సై సి.ఎం.రాకేశ్ వారి సిబ్బంది హెచ్ సి మోహన్ రావు, కానిస్టేబుళ్లు వెంకట రమణ, చాంద్ బాష, మాదన్న, నరసయ్య, నాగరాజు, లవకుమార్ లను డోన్ డి.ఎస్.పి శ్రీనివాసుల రెడ్డి అబినందించారు.

అంబేద్కర్ విగ్రహాన్నీ ధ్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలోని బొమ్మల సత్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం చేతి వేలు, ముక్కును పగలగొట్టి రాజ్యాం గాన్ని అవమాన పరిచిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో అక్కడికి పోయి పరిశీలించడం జరిగిందని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి జి సోమన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈ.చెన్నయ్య,డిహెచ్పిఎస్ మాజీనాయకుడుసత్యం, ఏఐవైఎఫ్ నాయ కులు రవికుమార్, శంకర్, ఆటో యూనియన్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, శివ తెలిపారు.సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడుతూ నిన్న రాత్రి రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌బి.ఆర్ అంబేద్కర్ విగ్రహంను పగలగొట్టడం రాజ్యాంగాన్ని అవ మానపరచడమే అన్నారు. దోషులు ఎవరైనా సరే త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు.

విశాలాంధ్ర - బేతంచెర్ల రూరల్ : భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబెద్కర్ విగ్రహానికి ఘోర అవమానం జరిగిన ఘటన నంద్యాల లోని బొమ్మల సత్రం వద్ద జరిగిన విషయం పై దళిత సోదరులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. మొదట అంబెద్కర్ కాంస్య విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం దళిత సోదరులు మాట్లాడుతూ దళితులపై రోజు రోజుకు దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని,చివరకు అంబెద్కర్ విగ్రహాలను సైతం దండుగులు వదలకుండా దాడులు చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యం కొట్టుకొచ్చినట్లుగా కనపడుతుందని,వెంటనే దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.నిరసన తెలిపిన వారిలో మేకల నాగరాజు,రుబెన్,మాల మహానాడు మద్దిలేటి, భార్గవ్,నల్లాడ్డి, తదితర దళితసంఘాల సోదరులు ఉన్నారు.

విశాలాంధ్ర - నంద్యాల : అంబేద్కర్ విగ్రహాన్నీ ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షులు జై లక్ష్మీ నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాతకే రక్షణ లేకపోతే సామాన్యులకు ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నంద్యాల బొమ్మలసత్రం వద్ద ఉన్న డా.బాబాసాహెబ్ అంబెద్కర్ విగ్రహాన్ని ద్వంసం చేసిన వ్యక్తులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, జిల్లా ఏర్పడిన తర్వాత ఎస్పీ ఆఫీస్ కూత వేటు దూరంలో ఉన్న కూడా అంబెద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం చాలా బాధాకరమని, గతంలోనే అంబెద్కర్ విగ్రహాన్ని నంద్యాల నగర నడి బొడ్డులో పెట్టాలని ఎన్నో ధర్నాలు, దీక్షలు, యువజన సంఘాలు పోరాటాలు చేశాయని, కానీ జిల్లా కలెక్టర్ గాని, స్థానిక ఎమ్మెల్యే గాని, ఎంపీ కానీ స్పందించక పోవడం చాలా బాధాకర మైన విషయమన్నారు.

పర్యాటకులకు భరోసా, భద్రత కల్పించడమే ధ్యేయం

విశాలాంధ్ర-మహానంది : మహా నంది దేవస్థానం ముందు భాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ టూరిస్టు పోలీస్ స్టేషన్ మంగళవారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వై.యస్ జగన్‌మోహన్ ఒడ్డి వీడియో కాన్ఫరెన్సులో వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 21 పర్యాటక ప్రాంతాలలో టూరిస్టు పోలీసు స్టేషన్‌లు ఏర్పా టు చేశారని, ముఖ్యమంతిచే వర్చువల్ విధానంలో ఆవిష్కరణ జరిగిందన్నారు. నంద్యాల జిల్లాలోని మహనందిలోని టూరిస్టు పోలీసుస్టేషన్ ను ఆవిష్కరణ చేసి ప్రారంభించామన్నారు. ఈ టూరిస్టు పోలీసుస్టేషన్ లో ఒక ఎస్సై ఆధ్వర్యంలో 7మంది పోలీసులు రోటేషన్ వద్దతిలో విధులు నిర్వహి స్తుంటా రన్నారు. పోలీస్ శాఖకు దేవస్థానం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. సెలవు రోజుల లో ప్రత్యేక పర్వదినాలలో రోజుకు లక్ష మంది దాకా భక్తులు వస్తుంటారని పేర్కొన్నారు. నంద్యాల డిఎస్పీ మహేశ్వర్ రెడ్డి స్పెషల్ బ్రాంచ్ సిఐదస్తగిరి బాబు కమ్యూనికేషన్ డిఎస్పి పద్మ వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త శిల్ప భువనేశ్వర్‌రెడ్డి మహానంది చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి ధర్మకర్త గంగి శెట్టి మల్లికార్జున ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, భక్త శేషారెడ్డి, మహానంది మండలం సచివాలయ పోలీస్ సిబ్బంది ఎస్సై నాగార్జున రెడ్డి, పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో మంగళవారం టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ను ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్య మంత్రి వైఎస్ జగన్, డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డిలు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అహోబిలం ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ వేదమంత్రోచ్చారణల నడుమ డిఎస్పి సుధాకర్ రెడ్డి పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. డిఎస్పి మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాలు మరియు ఆధ్యాత్మిక కేంద్రాలలో ప్రతిరోజు భక్తులు, పర్యాటకులు సందర్శించడం జరుగుతుందన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండడం కోసం వారి రక్షణ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టడం, దొంగ తనాలు జరగకుండా చూడడం, జరిగిన వెంటనే సంఘటనపై తగిన విధంగా ఫిర్యాదు చేయుటకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు, భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. నేరాల నియంత్రనే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుంద న్నారు. పర్యాటకులు,.భక్తుల భద్రతకు భరోసాగా టూరిస్టు పోలీస్ స్టేషన్ పనిచేస్తుందన్నారు. రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు నరసింహులు, నిరంజన్ రెడ్డి, కేడిసిసి బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటే శ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నివారించండి

విశాలాంధ్ర - నంద్యాల : ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత నివారించండని ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్. సాయిశ్రీనివాస్ మంగళవారం నంద్యాల జిల్లాలో పాఠశాల సందర్శనార్థమై కేజీబీవీలు, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు సందర్శించి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యా రంగ సమస్యలను స్వీకరిస్తూ పర్యటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అనుసరిస్తున్న అశాస్త్రీయ విధానాలైన నూతన జాతీయ విద్యా విధానం, ప్రమోషన్లు, పనిసర్దుబాటు పేరుతో పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య రోజురోజుకు తగ్గిస్తూ ఉపాధ్యాయులపై పని భారం పెంచుతూ 3, 4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి అటు ప్రాథమిక విద్యారంగాన్ని ఇటు మాధ్యమిక విద్యారంగాన్ని ఉపాధ్యాయుల కొరతతో తూతూ మంత్రంగా విద్యాబోధన జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నాలుగు సంవత్సరాలుగా కరోనాతో మరణించిన ఉపాధ్యాయుల స్థానంలో రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల స్థానాలో గానీ ఒక పోస్టు కూడా భర్తీ చేయకుండా ఒక పాఠశాలలను మూసివేయడం ఏకోపాధ్యాయ పాఠశాల లేకుండా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఈనాడు ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య నానాటికి పెరుగుతుండడం విచారకరమన్నారు. కనుక ఉపాధ్యాయుల కొరతను డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని, ఉపాధ్యాయులకు నాలుగు సంవత్సరాలుగా రావాల్సిన కరువు భత్యం, పిఆర్సి అరియర్స్ సరెండర్ లీవులను ఎప్పుడు చెల్లిస్తారో, సిపిఎస్ ఎప్పుడు రద్దు చేస్తారో, తెలియజేయాలని, జీతాలు ఆలస్యం అవ్వటానికి స్పష్టమైన కారణం ఏమిటో ప్రభుత్వం తెలియజేయాలనీ ఎస్టీయు సంఘ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టియు రాష్ట్ర సహాధ్యక్షులు ఏస్. చంద్రశేఖర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజాంబేగ్, మౌలాలి, లక్ష్మన్న, దేవేందర్, ప్రసాదు, మద్దిలేటి, సుబ్బరాయుడు, తిరుపతయ్య, ప్రకాష్, ఎల్. సుబ్బయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్నాసుర రక్త చరిత్ర పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - బనగానపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు,బనగానపల్లె మాజీ శాసన సభ్యులు బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు వైయస్ వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించిన "జగనాసుర రక్త చరిత్ర "పోస్టర్ ను బీసీ జనార్ధన్ రెడ్డి టిడిపి నాయకుతో కలిసి విడుదల చేసారు. బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులోని నిజానిజాలు రాష్ట్ర ప్రజలకు తెలుస్తాయని ఆయన అన్నారు. ఈ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ పుస్తకంలో సాక్ష్యాలను ఎలా చెరిపివేశారు,హత్య వెనుక ఎవరున్నారు?వంటి వివరాలు ఉన్నాయని అన్నారు.జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావడానికె కోడి కత్తి, చివరకు బాబాయిని హత్య చేసి, మచ్చలేని మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పై ఆరోపణలు చేయడం జరిగిందని, నిజాలు నిదానంగా ప్రజలకు తెలుస్తాయని ఆయన పేర్కొన్నారు. నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య,కాపుల పల్లె సర్పంచ్ తులసి రెడ్డి,బొబ్బల మద్దిలేటి రెడ్డి,క్రైప రఘునాథ్ రెడ్డి,నాగేశ్వరరెడ్డి,షేక్షావలి, కామేశ్వరుడు, శంకేశ్వర రెడ్డి, వేములపాడు సర్పంచ్ గురప్ప,శ్రీను, గోపాల్,గిరిబాబు పాల్గొన్నారు.

గ్రామంలో వరి పొలంబడి

విశాలాంధ్ర - గడివేముల : గడివేముల మండల పరిధిలోని దుర్వేసి గ్రామంలో వరి పొలంబడి కార్యక్రమాన్ని రైతు పరమేశ్వర రెడ్డి పొలంలో గడివేముల వ్యవసాయ అధికారి హేమసుందరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆనంతరం ఏవో హేమసుందరరెడ్డి మాట్లాడుతూ పొలంబడి సూత్రాలు, నీటి తడులు ఆవశ్యకత, ఎరువులు వాడకం, చీడపీడల కు తీసుకోవలసిన నివారణ చర్యలపై రైతు సోదరులకు వివరించారు. ఖరీఫ్ సీజన్లో అయితే చదరపు మీటర్కి 33మొక్కలు, రబి సీజన్లో అయితే చదరపు మీటర్‌కి 44కుచ్చులు ఉండవలని సూచించారు. అలాగే తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యమైన దిగుబడిని పొందటం గురించి తెలియజేశారు. దుర్వేసి ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

వైయస్సార్ భీమా అందజేత

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో బాధిత కుటుంబానికి వైయస్సార్ భీమా తక్షణ సహాయం కింద రూ. 10 వేలు నగదు సర్పంచ్ రామ మద్దిలేటిరెడ్డి మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన మునగ నాగజ్యోతి (55) అనారోగ్యంతో మృతి చెందారు. తక్షణ సహాయం కింద మృతురాలు కుమారుడు చంద్రహాస్ గుప్తాకు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి మదన గోపాల్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ నాగకుమార్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే ప్రజా సంక్షేమం సాధ్యం

విశాలాంధ్ర - వెలుగోడు : టిడిపి అధినేత చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, ఆయనను ముఖ్యమంత్రి చేసే బాధ్యతను ప్రజలు తీసుకోవాలనినాయకులుతెలిపారు.

శ్రీశైలం నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఆదేశాల మేరకు ఐదవ రోజు మంగళ వారం వెలుగోడు పట్టణంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, అన్నరపు శేషిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం, పట్టణ అధ్యక్షులు ఖలిలుల్లా ఖాన్, హిదయత్ అలి, మోమిన్ రసూల్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, మద్దెల శంకర్ రెడ్డి, టైలర్ సయ్యద్, అసర్ వజీర్, మాలిక్ అహ్మద్,హుస్సేన్ సాహెబ్, హమీద్ ఖాన్, శంకర్ రెడ్డి, హిదయత్,ఖాజా, బందెల రవి, గౌండ బషీర్, జఫీర్,ఖలీల్, జబివుల్ల పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో అమరులైన సైనికులకు నివాళి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ కమిటీ కార్యదర్శి అమీర్ భాష మంగళవారం పుల్వామా ఉగ్రదాడిలో చనిపోయిన సైనికులకు నివాళులు అర్పించారు. ప్రజ్ఞా డిగ్రీ కళాశాల నుంచి ఎన్సిసి విద్యార్థులతో ర్యాలీగా నాలుగు రోడ్ల కూడలి వద్దకు చేరుకున్నారు. అక్కడ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి సెల్యూట్ చేస్తూ నివాళులర్పించారు.ఆమిర్‌భాష మాట్లాడుతూ పుల్వామా అమర వీరుల త్యాగాన్ని దేశం ఎన్నటికీ మరువదని, దేశాభి వృద్ధికి వీర సైనికుల సౌర్యమే స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజ్ఞా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, అరుణోదయ స్కూలు ప్రధానోపా ధ్యాయులు ఇమామ్ హుస్సేన్, ఎన్సిసి అధికారి శివన్న, ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

విశాలాంధ్ర-బనగానపల్లి : బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలం పరిధిలోని అప్పలాపురం గ్రామంలో "ఇదేం కర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం తెలుగుదేశం పార్టీ నాయకులు నిర్వహించడం జరిగింది. గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని, రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 15, ఫిబ్రవరి 2023

సైక్లింగ్ ర్యాలీ ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల : నగర నడిబొడ్డులో ఉన్న కర్నూలు ఏ క్యాప్ అర్బన్ హెల్త్ సెంటర్ వారి ఆధ్వర్యంలో సైక్లింగ్ ర్యాలీని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఇంచార్జి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి జీవన విధానంలో ప్రతి ఒక్కరు తమ అలవాట్లను మార్చుకుంటూ ప్రతిరోజు సైక్లింగ్ చేయడం వలన మానవులు ఎన్నో ప్రమాదాల నుండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. ముఖ్యంగా గుండె జబ్బులు, క్యాన్సర్ , మధుమేహం మరియు దీర్ఘకాలక ఊపిరితిత్తుల వ్యాధితో సహా నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులు కూడా నివారించవచ్చని, శారీరక బరువును నియంత్రించుకోవచ్చని, అధికంగా ఉన్న క్యాలరీలను ఖర్చు చేయవచ్చని కండరాల పట్టిత్వమును పెంపొందించడానికి బలోపేతం చేయడానికి సహాయపడుతుందన్నారు. రోజువారి ఒత్తిడిని, రక్తపోటు ను అదుపులో ఉంచుకోవచ్చు అన్నారు. ప్రతిరోజు సైక్లింగ్ చేయడం ద్వారా ఏ కారణం చేతనైనా మరణించే ప్రమాదాన్ని 41% తగ్గించవచ్చు అనగా క్యాన్సర్ సంబంధిత మరణాలను 45% మరియు గుండె జబ్బుల ద్వారా సంభవించే మరణాలను 46% అరికట్టువచ్చని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కర్నూలు డి ఐ ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్ హాస్పిటల్ పరిపాలన విభాగ అధికారి డాక్టర్ శివ బాల నగాంజన్, కర్నూలు ఏ. క్యాంపు అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ జి మాధవి, ఫార్మసిస్టు రమేషప్ప,అర్బన్‌హెల్త్‌సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీసర్వే ప్రారంభం

విశాలాంధ్ర -హొళగుంద : హొళగుందలో మంగళవారం భూ రీ సర్వే కార్యక్రమం ప్రారంభమైంది. రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న భూ రక్షణ భూ హక్కు పత్రం కోసం భూరీసర్వే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. అందులో భాగంగా హొళ గుందలో భూ సర్వేలో వీఆర్వో విజయలక్ష్మి సర్వేయర్ చారి వీఆర్ఏలు మల్లయ్య సిద్ధలింగ నరసమ్మలు భూములను గుర్తించి రైతులతో సమా చారం అడిగి తెలుసుకున్నారు.భూరీ సర్వేకు కావలసిన కాగితాలను రైతుల ద్వారా సేకరించారు. భూమిగట్లు భూమివిస్తీర్ణం సాగు చేస్తున్న రైతు పేరు తదితర సమాచారాన్ని రెవెన్యూ అధికారులు సేకరించారు. గ్రామంలో 12వేల ఎకరాల భూరీసర్వే చేయాల్సి ఉందని అందుకు ప్రజలు రైతులు సహకరించాలని వీఆర్వో విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతుకు సమా చారం అందించి భూ సర్వే చేపడుతున్నామని అన్నారు. భూ రీ సర్వే కార్యక్రమాన్ని ప్రజలు రైతులు సద్వినం చేసుకోవాలని కోరారు.

వైసీపీ అరాచక పాలనకు త్వరలోనే అంతిమ ఘడియలు

- భూ కబ్జాల ప్రభుత్వాన్ని సాగనంపుదాం
- పత్రికల జోలికి వెళితే మంత్రి భూస్థాపితం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విశాలాంధ్ర - ఆలూరు : రాష్ట్రంలో దౌర్జన్యాలు, అరాచకాలు, రౌడీయిజం, భూ కబ్జాలు మితిమీరి పోవడంతో వైసీపీకి అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోనే అధికార పార్టీ నాయకుల కబ్జాకు గురైన ఊరు చెరువును సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన సీపీఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ మాట్లాడుతూ నిజాలను నిర్భయంగా వార్తలు రాసే జర్నలిస్టులను బండికి కట్టుకొని లాక్కొస్తానని అధికార పార్టీ నాయకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారంటే, వారికి పిచ్చి ముదిరి అధికారమనే అహంకారంతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, త్వరలోనే వారిని ఇంటికి సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గతంలో మంత్రి జయరాం పైనా.. రైతుల భూముల వ్యవహారంలో ముఖ్యమంత్రి ఏమి మాట్లాడలేని, పైగా ఆయనని మంత్రిగా రెండోసారి కొనసాగించటం జరిగిందన్నారు. ఆలూరు పట్టణంలో అత్యధిక జనాభా ఉన్నారని,రాబోవు రోజుల్లో 40,50వేల జనాభాకు చేరుకుంటుం దని అలాంటప్పుడు త్రాగడానికి నీరు కూడా కష్టమవుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చుకొని త్రాగ నీరు ఇవ్వడానికి ఆస్కారం ఉందని, అలా కాకపోతే వేదావతి నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటి చెరువులో నిలువ చేసుకోవచ్చు అన్నారు. మూడున్నరేళ్లుగా సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి శూన్యమని, ఏ వర్గ ప్రజలూ సంతోషంగా లేరన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ తరహా కక్షసాధింపు రాజకీయాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, రౌడీయిజం, దాడులు, అక్రమ కేసులు బనాయించడం,ప్రతిపక్షాలపై వేధింపులకు పాల్పడలేదని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ తప్ప ఏ రాజకీయ పార్టీ కూడా ప్రజల్లో ఉండకుండా కుయుక్తులకు పాల్పడుతూ అధికారులు, పోలీసుల ద్వారా అడ్డుకోవడం జరుగుతోందని దుయ్యబట్టారు. జీవో నెంబర్ ఒకటిని తీసుకువచ్చి ప్రజాస్వామ్యాన్ని కాల రాసేందుకు కుట్ర జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో కాస్తో కూస్తో మాట్లాడుతున్నాం అంటే అది పత్రికలు, టీవీల ద్వారానే జరుగుతుందని, పత్రికల స్వేచ్ఛను అరికట్టడానికి స్వేచ్ఛను కాలరాయడానికి ఎవరైతే ప్రయత్నం చేస్తారో.. దుర్మార్గానికి, దౌర్జన్యాలకు ఒడి కడతారో అలాంటివారు భూస్థాపితం కావడం తథ్యమని జోస్యం చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించి వారికి ఇవే చివరి ఎన్నికలుగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వర రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, ఈశ్వరయ్య, ఓబులేసు, జగదీష్, జంగాల అజయ్ కుమార్, వనిజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఆవుల శేఖర్, లెనిన్ బాబు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కాటమయ్య, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, రాజా సాహెబ్, రంగన్న, విరుపాక్షి, కారుమంచి, ఆలూరు మండల సిపిఐ కార్యదర్శి రామాంజనేయులు, సీనియర్ నాయకులు భూపేష్, మారెప్ప, కృష్ణమూర్తి, ఆంజనేయ, శివ, మునిస్వామి, భాష తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -హొళగుంద : సాగునీటి పారుదల ప్రాజెక్టుల (వేదవతి) పరిశీలన సీపీఐ పర్యటన విజయవంతం అయింది ఆలూరు నుండి సీపీఐ అగ్రనేతలు పార్టీ నాయకులు కార్యకర్తలుగుల్యం వద్ద ప్రవహించే వేదావతి నదిని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.రామకృష్ణ పరిశీలించారు. సాగునీటి విషయాలు సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ గురించి రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.వేదవతి సాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వేదావతి సాగునీటి ప్రాజెక్టు 8టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తే తాగు త్రాగునీటికి అనుకూలమవుతుందని అన్నారు.ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.గిడ్డయ్య ఈ కార్యక్రమంలో హొళగుంద మండల సిపిఐ సహాయ కార్యదర్శులు పెద్దహ్యాట మారెప్ప ఎస్. రంగన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు శ్రీరంగ,మండల కార్యదర్శి సతీష్ కుమార్ ,సిపిఐ నాయకులు మస్తాను, వెంకన్న ,నూర్ భాషా, గాదిలింగ,శివ,విద్యార్థి యువజన సంఘాల నాయకులు పెద్ద ఎత్తైన పాల్గొన్నారు.

ఘనంగా జూమ్ స్కూటర్ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-కోడు మూరు : కోడుమూరులోని సస్య షోరూమ్ వారి ఆధ్వర్యంలో హీరో కంపెనీ నూత నంగా లాంచ్ చేసిన జూమ్ స్కూటర్ ను మంగళవారం గ్రామ సర్పంచ్ బి. భాగ్య రత్న ఘనంగా ప్రారంభించారు. ముందుగా భాగ్యరత్న షోరూమ్‌లో జ్యోతి ప్రజ్వలన, రిబ్బన్ కట్ చేశారు. అనంతరం షోరూం మేనేజర్ అభిద్ సిబ్బందితో కలిసి కేక్‌కట్ చేసి కొత్త స్కూటర్ లాంచ్ సంబరాలు జరుపు కున్నారు. అభిద్ మాట్లాడుతూ మంగళవారం దేశవ్యాప్తంగా హీరో కంపెనీ జూమ్ స్కూటర్ ను లాంచ్ చేసిందన్నారు. స్కూటర్ మహిళలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. బ్లూటూత్ కనెక్టివిటీతో ఫోన్‌కు ఎస్ఎంఎస్, కాల్ అలర్ట్ సౌకర్యం కలిగి ఉన్నట్లు చెప్పారు.110 సీసీ సామర్థ్యం కలిగిన స్కూటర్లలో డిజిటల్ మీటర్ తో తొలిసారిగా ప్రవేశ పెడుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్.ఆంధ్రయ్య, షోరూమ్ సిబ్బంది అహమ్మద్, వీరేష్ పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - పత్తికొండ : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి సూచించారు. మంగళవారం పరీక్ష పర్ వ్ 4.0 కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర గురుకుల పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సులభశైలిలో ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకునే విధానాన్ని, పరీక్షలు రాసే విధానాన్ని వివరించడం జరిగింది. ప్రతి సబ్జెక్టులో మొదట సులభతర ప్రశ్నలను నేర్చుకోవాలని, చదువులో వెనుకబడ్డ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డైట్ లెక్చరర్ సంసుద్దిన్ మాట్లాడుతూ చదువు ప్రాధాన్యతను గురించి,పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్ అరుణాచలం రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మస్తాన్ వలి, సరోజినీ హుస్సేనమ్మ,సువర్ణలత, ఎస్టియు రాష్ట్ర కౌన్సిలర్ కొత్తపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ బూతులు పరిశీలించిన తహశీల్దార్

విశాలాంధ్ర - హొళగుంద : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ మరియు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 13న జరుగుతున్న సందర్భంగా మంగళవారం తహశీల్దార్ హుస్సేన్‌సాబ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ కోసం నిర్వహించే పోలింగ్ బూతులు పరిశీలించారు. అలాగే పట్టభద్రులు ఓటింగ్ కోసం నిర్వహించే పోలింగ్బూత్లను పరిశీలించి అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. తాసిల్దార్ హుస్సేన్ సాబ్ మాట్లాడుతూ మండలంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్లు 527మంది ఉన్నారని ఇందులో మహిళా ఓటర్లు 72మంది పురుష ఓటర్లు 455మంది ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఓటర్లు కేవలం 6మంది ఉన్నారని మహిళా ఓటరు ఒకరు పురుష ఓటర్లు ఐదు మంది ఉన్నా రని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న సందర్భంగా ఫ్లెక్సీలు ఫ్లెక్సీ బ్యానర్లు తొలగింపురాజకీయ నాయకుల విగ్రహాలను కప్పి వేయడం జరుగుతుందని అన్నారు ఎన్నికల నిర్వహణ సరే సార్వోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు పోలింగ్ బూత్ పరిశీలన లో మండల సర్వేయర్ శ్రీనివాసులు విఆర్ఓ విజయలక్ష్మి వీఆర్ఏలు మల్లయ్య సిద్ధ లింగ సిబ్బంది బసవరాజ్ పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

విశాలాంధ్ర-సి.బెళగల్ : మండల కేంద్రం తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులు రబీ సీజన్లో వేసినటువంటి వేరుశెనగ, జొన్న పంటలకు ఈనెల 18వ తేది లోపల ఈకే వైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బూరాన్ దొడ్డి, కంబదహాల్ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ అధికారి సందర్శించి అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకులతో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ లోపల రైతులు వేసిన పంటలను ఈకేవైసీ పూర్తి చేయాలని ఆయన వారికి సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వేరుశెనగ,జొన్న పంటలను ప్రభుత్వం మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తారని ఆయన రైతులకు తెలియజేశారు. మీ గ్రామ రైతు భరోసా కేంద్రాల్లోని ఆర్బికే ఇన్చార్జిలను కలిసి రైతుల రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు. వ్యవసాయ సిబ్బంది మారెప్ప, శశిదేవి, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

ఏపీ టూరిస్టు పోలీస్ స్టేషన్ ప్రారంభం

విశాలాంధ్ర-మంత్రాలయం : భక్తుల సౌకర్యార్థమే టూరిస్టు పోలీస్‌స్టేషన్ జిల్లా ఎస్పీ సిద్దార్థకౌశల్ ఐపియస్ వచ్చే పర్యాటకుల భద్రత, సేవా భావంపై దృష్టి సారిస్తాం. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణం మధ్వ కారిడార్ ప్రత్యేక భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ టూరిస్టు పోలీస్‌స్టేషన్ మంగళ వారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్‌జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు లో వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 21పర్యాటక ప్రాంతాలలో టూరిస్టు పోలీసు స్టేషన్‌లు ఏర్పాటు చేశా రని, మంగళవారం ముఖ్యమంతిచే వర్చువల్ విధానంలో ఆవిష్కరణ జరిగిందన్నారు. కర్నూలు జిల్లాలోని మంత్రాలయం శ్రీమఠంలోని టూరిస్టు పోలీసుస్టేషన్ ను ఆవిష్కరణ చేసి ప్రారంభించామన్నారు. ఈటూరిస్టు పోలీసుస్టేషన్‌లో ఒక ఎస్సై ఆధ్వర్యంలో 7మంది పోలీసులు రోటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తుంటారన్నారు. భద్రత పరంగా సేవలు అందిస్తారన్నారు. ఏదైనా ఆపద, ప్రమాదం జరిగిన సమయాలలో తదితర విషయాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తారన్నారు. భద్రతే ప్రధానంగా సేవలందిస్తామన్నారు. వచ్చే పర్యాటకుల భద్రత, సేవా భావం పై దృష్టి సారిస్తామ న్నారు.భక్తులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భక్తుల సౌకార్యర్థం ఏటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.

మంత్రాలయంకు రాఘవేంద్ర స్వామి దర్శనార్థం సామాన్య భక్తులే కాకుండా ప్రజా ప్రతినిధులు, విఐపిలు అత్యధిక సంఖ్యలో వస్తుండడంలో అత్యధిక భద్రత కల్పిస్తామన్నారు. రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తు లకు పోలీసు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పర్యాటకులకు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించేలా ఇకపై ఈ టూరిస్ట్ పోలీసింగ్ విధానం సమర్థవంతంగా అమలు కానుందన్నారు. సమాచారాన్ని బ్రోచర్ల రూపంలో అందుబాటులో ఉంచార న్నారు. పోలీస్‌శాఖకు శ్రీమఠం ఎప్పుడు అండగా ఉంటుందని శ్రీమఠం పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థులు తెలిపారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ను కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థకౌశల్ ఐపియస్‌తో పాటు శ్రీమఠం పీఠాధిపతులు ప్రారంభించారు. పీఠాధిపతులు మాట్లాడుతూ...పోలీసు శాఖకు అన్ని సహాయ సహకారాలు మఠం తరపు న అందిస్తామని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు కావలసిన గదులు, ఫర్నీచర్ ఇతర ఇతర సామాగ్రి శ్రీమఠం అందిస్తుంద న్నారు. దేశంలోని మంత్రాలయం క్షేత్రం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యాట క కేంద్రాలలో ఒకటిగా నిలుస్తుందన్నారు. సెలవు రోజులలో ప్రత్యేక పర్వదినాలలో రోజుకు లక్ష మంది దాకా భక్తులు వస్తుంటారని పీఠాధిపతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, ఆదోని డిఎస్పీ వినోద్‌కుమార్, మంత్రాలయం సిఐ శ్రీనివాసులు, కమ్యూనికేషన్ సిఐ మనోహర్,మంత్రాలయం ఎస్సై వేణుగోపాల్ రాజు,మాధవరం ఎస్సై కిరణ్ బాబు, టెంపుల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎఓ మాధవశెట్టి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వివేకా హత్య నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, పాణ్యం మాజీ శాసన సభ్యురాలు, టీడీపీ ఇంచార్జి గౌరుచరిత రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మాధవినగర్ గౌరు దంపతుల స్వగృహంలో వైయస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించిన "జగనాసుర రక్త చరిత్ర "పోస్టర్‌ను గౌరు చరిత రెడ్డి,గౌరువెంకటరెడ్డి,టీడీపీ నాయకులతో కలిసి విడుదల చేశారు. గౌరు చరితరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వైఎస్ వివేకా నందరెడ్డి హత్య కేసులోని నిజానిజాలు రాష్ట్ర ప్రజలకు తెలుస్తాయని అని అన్నారు. ఈ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ పుస్తకం లో సాక్ష్యాలను ఎలా చెరిపివేశారు. హత్య వెనుక ఎవరున్నారు వంటి వివరాలు ఉన్నాయని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి కోడి కత్తి, చివరకు బాబాయిని హత్య చేసి, మచ్చలేని మాజీ సీఎం చంద్రబాబు నాయుడుపై ఆరోపణలు చేయడం జరిగిందని,నిజాలు నిదానంగా ప్రజల కు తెలుస్తాయని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి,మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ యన్ వి రామకృష్ణ, నియోజక వర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు యస్.ఫిరోజ్, నియోజకర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి,నంద్యాల పార్లమెంట్ యస్‌సి.సెల్ అధ్యక్షుడు నాగ శేషులు, పాణ్యం మండల కన్వీనర్ జయరామిరెడ్డి,ఉయ్యాలవాడ నాగేశ్వరరెడ్డి, దొడ్డిపాడు బాషా,రవి ప్రకాష్ రెడ్డి,రవీందర్ రెడ్డి,పాల్గొన్నారు.

విశాలాంధ్ర - పత్తికొండ : వైయస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న వారిని తక్షణమే శిక్షించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకటరాముడు, జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో జగనాసుర రక్త చరిత్ర బుక్ లెట్ ను తెదేపా నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వివేకానంద రెడ్డిని హత్య చేసి నాలుగు సంవత్సరాలుగా వస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిందితులను కప్పిపుచ్చేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. వివేకా హత్యలో జగన్మోహన్ రెడ్డి, భారతి, అవినాష్ రెడ్డిల హస్తం ఉందని వారు ఆరోపించారు.

విచ్చలవిడిగా అక్రమ మద్యం : నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో విచ్చల విడిగా అక్రమ మద్యం లభిస్తుందని తెదేపా బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి రామానాయుడు విమర్శించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట కర్ణాటక మద్యంను స్థానిక పోలీసులు పట్టుకుని బొలెరో వాహనం, కార్‌ను సీజ్ చేశారని, అధికార పార్టీకి చెందిన వారిని పోలీసులు కేసు నుంచి తప్పించడం ఆంతర్యం ఏమిటన్నారు. దాబా నిర్వాహకులు డాబాల్లో ఇతర రాష్ట్రాల మద్యం విచ్చలవిడిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెదేపా నాయకులు ముత్యాల తిరుపాల్, అశోక్ కుమార్, తిమ్మయ్య చౌదరి, సంజప్ప, కడవల సుధాకర్, బి.టి.గోవిందు, పత్తి ప్రసాద్, జానకమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

దళిత జన భాంధవుడు దామోదరం సంజీవయ్య

విశాలాంధ్ర-కర్నూలు రూరల్ : దళిత జన బాంధవుడు దామోదరం సంజీవయ్య అనీ కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎం.సుధాకర్ బాబు అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన స్వర్గీయ దామోదరం సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. దామోదరం సంజీవయ్య నలుగురు ప్రధానమంత్రుల క్యాబినెట్లో మంత్రిగా రెండు సార్లు,అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగాను రాష్ట్ర ముఖ్యమంత్రిగా అత్యున్నత పదవులు అలంకరించారని వెల్లడించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీలకు రిజర్వేషన్లు కల్పించాడని ఆయన నీతి నిజాయితీకి కట్టుబడి పని చేశారని ఆయన ఎలాంటి ఆస్తులు సంపాదించలేదని అలాంటి మహోన్నత వ్యక్తి కర్నూలు జిల్లాలో పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. రాష్ట్రంలో పరిపాలన ప్రాంతీయ పార్టీలతో చేతగావడం లేదని ప్రజలు తిరిగి జాతీయ పార్టీ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వస్తే వంటగ్యాస్ సిలిండర్ 500కే ఇస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి పాలన గాడి తప్పిందని అధికార వైసిపి చేస్తున్న దాడులను ప్రజలు గమనిస్తున్నారని వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పో యిందని రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో విఫలమైందని ఏపథకమయినా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాత్రమే చేరుతున్నాయని సామాన్య ప్రజలకు అందడం లేదని గ్రామాల్లో రాచరిక పాలనను తలపిస్తోందని తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్త ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న ఎస్సీ సెల్ జిల్లాఅధ్యక్షులు ఎన్ బజారన్న డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ అమరేందర్ రెడ్డి సిటీ మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా హుస్సేన్, సిటీ మహిళా అధ్యక్షురాలు ఎస్ ప్రమీల, ఎస్సీ సెల్ డబ్బు సత్యరాజు, కె.వెంకట రెడ్డి,సాంబశివుడు, బివి.సుబ్రహ్మణ్యం శివానంద్, అభి నాయుడు వసిం బాషా, రియాజ్,ఐఎన్‌టియుసి జేమ్స్, గోవిందు, కెఆనందం, బిటిస్వామి, మహిళా కాంగ్రెస్ ఎస్ సారమ్మ కె.వెంకటలక్ష్మి ప్రభావతి అరుణ ఎల్లమ్మ, మద్దమ్మ, మొదలైన వారు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మంగళవారం స్వర్గీయ దామోదరం సంజీవ య్య 102వ జయంతి వేడుకలను మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడు మరియు సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో రాముడు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేసి అతి చిన్న వయసులోని ఉన్నత పదవులు అధిరోహించారని 38సంవత్సరాల వయసులోని ముఖ్యమంత్రి పదవిని చేపట్టి దేశంలోని మొట్టమొదటి చిన్న వయసు దళిత ముఖ్యమంత్రిగా అలాగే మొట్టమొదటిదళిత ఏఐసీసీ ప్రెసిడెంట్‌గా పనిచేసి తన రాజకీయ జీవితం అంతా నిజాయితీగా నిరాడంబరంగా సమాజ సేవ కోసం పాటుపడినటువంటి మహోన్నతమైన వ్యక్తి అని ఆయన 102వ జయంతి సందర్భంగా స్మరించుకోవడం మన అందరి అదృష్టం అని ఆయనను ఆదర్శంగా తీసుకొని ఈరోజు ఉన్నటువంటి రాజకీయ నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకొని పరిపాలన చేయాలని ఆయన అన్నారు. ఎంపీడీవోతో పాటుఈ ఓఆర్‌డి సందీప్, ఏపీఓ లక్ష్మన్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పైపులైన్ ఏర్పాటు

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో కురువ వీధిలో కే.టి. శివన్న ఇంటి దగ్గర మోటార్ చెడిపోవడంతో పాటు పాత పైపులైన్ తుప్పు పట్టిపోవడంతో ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామ సర్పంచ్ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం కొత్త పైపులు తెచ్చి పనులు చేపట్టారు.సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పాత పైపులు మార్చి కొత్త పైపులైన్ వేయడం జరిగిందన్నారు. మోటార్ కూడా రిపేరు చేయించినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్క రించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వైభవంగా వన్నూరు వలి ఉరుసు ఉత్సవం

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్ : మండల పరిధిలోని కరివేముల గ్రామంలో మంగళవారం జరిగిన వన్నూర్ వలిస్వామి ఉరుసు ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వైసిపి నాయకులు ఎల్కే శ్రీనివాసులు, వీరేష్ ఆయనకు పూల, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు.వైసీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, జడ్పిటిసి కిట్టు, వైసీపీ మండల నాయకులు దివాకర్ నాయుడు, నారాయణరెడ్డి,మదన్‌మోహన్‌రెడ్డి, రామచంద్ర, జయరాం పాల్గొన్నారు.

తహశీల్దార్ను బురిడీ కొట్టిన సైబర్ నేరగాళ్లు

విశాలాంధ్ర -హొళగుంద : హొళగుంద తాసిల్దార్ హుస్సేన్‌సాబ్‌కు సైబర్ నేరగాళ్లు బురుడి కొట్టారు. వివరాలలోనికి వెళితే తహశీల్దార్ హుస్సేన్ సాబ్ సోమవారం విధి నిర్వహణలో బిజీగా ఉండగా అయితే అంతలోనే నేరగాడి ఫోన్ కాల్ వచ్చింది. నేను ఆదోని మున్సిపల్ కమిషనర్ మాట్లాడు తున్నాను. నా కుమారుడుకు నంద్యాల శాంతారామ్ మెడికల్ కాలేజీలో చదువుకోవడానికి సీటు కావాలని హొళగుంద వాసే అక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారని ఆయనతో మాట్లాడి సీటు ఇప్పించాలంటూ నకిలీ ఫోన్ నెంబరును తహశీల్దార్‌కు నేరగాడు ఫోన్ చేసి చెప్పాడు. ఉన్నతాధికారులు ఫోను చేశారనే విశ్వాసంతో తహశీల్దార్ ఎలాంటి ఫోన్ నంబర్లను పరిశీ లించకుండా అజాగ్రత్తపడి నేరగాడు పంపించిన ఫోన్ నెంబర్‌కు సంప్రదిం చారు. ప్రిన్సిపాల్ పేరిట ఉన్న మరో నేరగాడు ఫోన్‌లో మాట్లాడుతూ సీటు కన్ఫర్మ్ చేస్తానని అయితే 60వేల రూపాయలు నగదు చెల్లించాలని చెప్పడంతో తాసిల్దార్ నంద్యాలలోని తన మిత్రుడు రెడ్డికి ఫోన్ పే ద్వారా నగదును నేరగాళ్లకు వేయించారు. అయితే నేరగాళ్ల నంబర్లను పరిశీలించి మోసపోయానంటూ కంగు తిన్న తహశీల్దార్ ఆర్ఐ, విఆర్ ఓలతో వెళ్లి బుధవారం హొళ గుందా పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదించారు. పోలీస్‌స్టేషన్లో తహశీల్దార్లను విలేకరులు సంప్రదించగా పని ఒత్తిడి వల్ల పొరపాటు జరిగి మోసపోయా నని అన్నారు.జరిగిన విషయాన్ని ఎస్సైకి వివరించానని అన్నారు. ఎస్సై అబ్దుల్ జహీర్‌ను సమాధానం కోరగా నేరం జరిగిన ప్రాంతం తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. నంద్యాల ప్రాంతం పాతకోట ప్రాంతంలో నేరం జరిగిందని అన్నారు.

వేలంలో 14.43లక్షల ఆదాయం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలోని కింగ్ మార్కెట్, సైకిల్ స్టాండ్లకు నిర్వహించిన వేలం పాటలో కర్నూలు నగరపాలక సంస్థ కు 14.43 లక్షల ఆదాయం వచ్చినట్లు అదనపు కమిషనర్ వివి రామలింగేశ్వర్ తెలిపారు.మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ భవనంలో అడిషనల్ కమిషనర్ ఆధ్వర్యంలో కింగ్ మార్కెట్, ఫిష్ మార్కెట్, ఆఫీసు సైకిల్ స్టాండ్,కిడ్స్ వరల్డ్,శరాఫ్ బజార్ సైకిల్ స్టాండ్లకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా 5.85లక్షలకు కింగ్ మార్కెట్ ను మహమ్మద్ ఖాజీమ్ హుస్సేన్ దక్కించుకోగా, రూ 1లక్షకు ఫిష్ మార్కెట్ ను ప్రదీప్ దక్కించుకున్నారు.అలాగే 3.50 లక్షలకు కిడ్స్ వరల్డ్ సైకిల్ స్టాండ్,3.18లక్షలకు శరాఫ్ బజార్ సైకిల్ స్టాండ్ ను రామ్ చరణ్ దక్కించుకోగా,90వేలకు ఆఫీసు సైకిల్ స్టాండ్‌ను బంగి పద్మావతి దక్కి చుకున్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జునీద్, ఆర్ఐలు వాజీద్,సాదిక్, మన్సూర్, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టిజివి సంస్థల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : టిజివి సంస్థల సహకారంతో కర్నూలు నగరంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని కొత్త అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న కైలాసగిరి దేవాలయంలో శివస్వాములు, శ్రీశైలం పాదయాత్రీకు లకు టీజీవీ సంస్థల ఆధ్వర్యంలో బిక్షను ఏర్పాటుచేశారు. భాగంగా టిజి భరత్ ప్రత్యేక పూజలు చేసి అనంతరం స్వాములకు బిక్ష వడ్డించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ శివస్వాములకు బిక్ష ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శివస్వాములు దీక్షలో ఎంతో నిష్టతో ఉంటారని, దీక్ష పూర్తైన తర్వాత కూడా మంచి అలవాట్లను కొనసా గించుకోవాలన్నారు. కరోనా లాంటి భయంకరమైన వ్యాధులు మళ్లీ రాకూడదని దేవుడిని కోరుకుంటు న్నట్లు చెప్పారు. ఇక శివస్వాముల బిక్ష కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్న నిర్వాహకులను అభినందిస్తున్నట్లు చెప్పారు. శివస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-కోసిగి : మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామానికి చెందిన వందగల్లు.ఈరన్న అనే రైతు అప్పుల బాధతో మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు , బంధువులు తెలిపిన వివరాల మేరకు రైతు 10 ఎకరాల భూమి సాగు చేస్తున్నాడని అయితే పంట కోసం దాదాపు 15 నుంచి 20 లక్షలు అప్పు ఉందన్నారు. రోజు రోజుకు వడ్డీకి వడ్డీ పెరగడం , పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిపారు. గమనించిన బంధువులు హుటాహుటిన 108 వాహనంలో చికిత్స కోసం కోసిగి ఆరోగ్య కేంద్రానికి తరలించి , మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం రైతు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వామపక్ష అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించండి

విశాలాంధ్ర-హొళగుంద :వామపక్షాల ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజును అధిక మెజార్టీతో గెలిపించాలంటూ మంగళవారం జడ్పీ హైస్కూల్లో వామపక్ష నాయకులు రాధాకృష్ణ వెంకటేష్ నాగరాజు రవికుమార్లు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయ పట్టభద్రుల సమస్యల కోసం నిరంతరంగా పోరాడే వామపక్ష అభ్యర్థులను గెలిపిస్తే సమస్యలు తీరుతాయని అన్నారు. వామపక్ష అభ్యర్థులకు ఉపాధ్యాయులు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.